అమరావతి వార్త

వర్సిటీలో సిడిఇ విద్యార్థుల
ఆందోళన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నవంబరు4, ప్రభాతవార్త: ఏఎన్‌యు దూరవిద్య అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. బుధవారం వర్సిటీ దూరవిద్య పరిధిలో ఉన్న వివిధ స్టడీ సెంటర్‌లలో ఆయా కోర్సులను అభ్యసిస్తున్న అభ్యర్థులు, స్టడీ సెంటర్‌ల నిర్వాహకులతో కలిసి వర్సిటీకి వచ్చారు. ముందుగా ఇన్‌చార్జ్ వీసి

ఆచార్య గంగాధరరావును కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈనెలలో జరుగనున్న పరీక్షలకు వర్సిటీ నిర్ణయించిన పరీక్షా కేంద్రాలు తమ ప్రాంతాల నుంచి చాల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్ళి పరీక్షలు రాయాలంటే అనేక ఇబ్బందులు వస్తాయని విన్నవించారు. ముఖ్యంగా మహిళలు, వికలాంగులు ప్రయాణంలో అవస్థలు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్టడీ సెంటర్‌ల నిర్వాహకులు మాట్లాడుతూ గత పరీక్షల వరకు తమ అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగలేదని, ప్రస్తుతం పరీక్షల నిర్వహణపై దూరవిద్య అధికారులు తీసుకున్న నిర్ణయాలపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వీసి దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిసింది. స్టడీ సెంటర్‌ల నిర్వాహకులు, అభ్యర్థులు విన్నపాలను నిశితంగా పరిశీలించిన వీసి పరీక్షల నిర్వహణలో ఇబ్బందులు కలుగకుండ చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. అనంతరం రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్‌ను కలిసి సమస్యలు ఆయనకు తెలియజేయాలని సూచించారు. రెక్టార్‌తో భేటిఐన వారు బోరున విలపించే ప్రయత్నం చేశారు. ప్రస్తుత సెమిస్టర్ పరీక్షలలో కోర్సులు పూర్తిచేసుకుంటామని తమకు అవాంతరాలు ఎదురుకాకుండా నిర్ణయాలు తీసుకోవాలని వేడుకున్నారు.

పొంతనలేని సమయాలు

దూరవిద్య పీజీ 4వ, డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలను ఈనెల 11న నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ పరీక్షలు ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈక్రమంలో టైంటేబుల్‌ను రూపొందించారు. అందులో ఉదయం 8గం.ల నుంచి 11గం. లవరకు పరీక్షలు జరుగుతాయని ముద్రించారు. తాజాగా హాల్‌టికెట్‌లను కూడా ఆన్‌లైన్‌లో పెట్టారు. హాల్‌టికెట్‌లు పొందిన అభ్యర్థులు మాత్రం అవాక్కయ్యారు. టైం టేబుల్‌లో ఉదయం 8గం.క పరీక్షలు జరుగుతాయని ముద్రించగా హాల్‌టికెట్‌లో మాత్రం మధ్యాహ్నం 2గం. నుంచి 5గం.వరకు జరుగుతాయని అప్‌లోడ్ చేశారు. దీంతో ఖంగుతిన్న అభ్యర్థులు వర్సిటీ తీరుపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. టైంటేబుల్‌లో సమయాలు హాల్‌టికెట్‌లలో ముద్రించిన సమయాల్లో వ్యత్యాసాలు ఉండటంతో ఏం చేయాలో పాలుపోక తీరుమారని ఏఎన్‌యు అని వర్సిటీకి ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంపై పరీక్షల కోఆర్డినేటర్‌ను వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని చెప్పారు. డైరెక్టర్‌నుంచి వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

గుంటూరు నగర మేయర్‌గా అఖండ మెజారిటీతో విజయం సాధించిన లక్ష్మీ అపర్ణను మర్యాదపూర్వకంగా కలిసిన మాధవి

గుంటూరు,నవంబర్ 4,ప్రభాతవార్త : గుంటూరు నగర మేయర్‌గా అఖండ మెజారిటీతో విజయం సాధించిన లక్ష్మీ అపర్ణ కోవెలమూడి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఎన్నికల ప్రయాణంలో అడుగడుగునా అండగా నిలుస్తూ, విజయానికి వెన్నుదన్నుగా నిలిచిన మాధవికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి లక్ష్మీ అపర్ణకి సంప్రదాయబద్ధంగా సారె సమర్పించి, శాలువాతో సత్కరించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కొల్లిపర, నవంబరు 4, ప్రభాతవార్త:

సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీరు అందించడంతో ఎకరాకు 50 బస్తాల దిగుబడి అందే పరిస్థితిలో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండగా రెండు తుఫాన్ల ప్రభావంతో రైతులు సాగుచేసిన వరి,మినుము పంటలకు తీవ్ర నష్టం ఏర్పడిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి,కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండల పరిధిలో గల పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మంత్రి చంద్రశేఖర్ పరిశీలించారు.రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.కొందరు రైతులు బీమా చేయించుకోగా మరి కొందరు బీమా చేయించుకోలేక పోయారని చెప్పారు.పంటలు నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేస్తామని తెలిపారు.పంట బీమా చేయించుకోని రైతుల నష్టాన్ని పరిగణలోకి తీసుకుని న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఇప్పటికే జిల్లా కలెక్టర్,వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు ఉన్నప్పటికీ రానున్న 48-72 గంటల్లో పంటల నష్టానికి సంబంధించి ఎన్యుమరేషన్ పూర్తి చేసి బాధిత రైతులకు ఏ విధంగా

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నష్టపరిహారం అందించాలనే అంశంపై చర్యలు తీసుకుంటామని చంద్రశేఖర్ వెల్లడించారు.కౌలు రైతులకు ప్రభుత్వ సహాయం అందాల్సిన అవసరాన్ని గుర్తించామని చెప్పారు.అన్నదాత సుఖీభవ పథకం కింద అందే రూ.20 వేల ఆర్థిక ప్రయోజనం

అందలేదన్నారు.అయితే ప్రస్తుతం పంట నష్టానికి సంబంధించి అందించే ఇన్‌పుట్ సబ్సిడీని కౌలు రైతులకు వర్తింప చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత

ఏపతి ఒక్కరిపై ఉందన్నారు.కౌలు రైతులు బాగుంటేనే భవిష్యత్‌లో వ్యవసాయం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.నష్టపోయిన రైతులకు అండగా నిలిచి న్యాయం చేస్తామని మంత్రి చంద్రశేఖర్ హామీనిచ్చారు.ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరుస తుఫాన్ల కారణంగా చేతికి అందాల్సిన పంట నేలపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు వచ్చినప్పుడు రైతులు తమకు జరిగిన నష్టాన్ని నమోదు చేయించుకోవాలని చెప్పారు.పంటలకు జరిగిన నష్టం గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళేందుకు మంత్రి చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో పర్యటించారని చెప్పారు.ఇప్పటికైనా రైతులంతా పంటల బీమా చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి,నీటి సంఘం అధ్యక్షుడు బి.శ్రీరాముల రెడ్డి,చంద్రారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.ల

ఉపాధ్యాయులు ఓటర్ల నమోదు 6 తేదీలోగా పూర్తి చేసుకోవాలి

గుంటూరు విద్య నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీవికాస్ విద్యా సంస్థల ఆవరణలో ప్రైవేట్ స్కూల్ టీచర్స్ యూనియన్ కృష్ణాగుంటూరు జిల్లాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఉపాధ్యాయఓటర్లనమోదు, మండల స్థాయి ఓటర్ల నమోదుకు బాధ్యుల నియామకం, అభ్యర్థిఎంపికపై సమావేశములో చర్చజరిగినది. ఈ సందర్భముగా, కృష్ణాగుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గం నుండి శాసన మండలి సభ్యునిగా ప్రైవేట్ స్కూల్స్ టీచర్స్ యూనియన్ తరపున అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రైవేట్ టీచర్స్, ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో మన గొంతుక వినిపించేందుకు కృషి చేసే నాయకత్వాన్ని బలపరిచేందుకు తప్పనిసరిగా ఫార్మ్19 ద్వారా , నవంబర్ 6 వ తేదీ లోపు అర్హతకలిగిన ఉపాధ్యాయులందరూ ఓటరుగా ఆన్లైన్ /ఆఫ్ లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని శ్రీ వికాస్ విద్యాసంస్థల అధినేత,రాష్ట్రగ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు ఈ సందర్భంగా ఉపాధ్యాయుల అందరికీ పిలుపునిచ్చారు. ప్రైవేట్ స్కూల్ టీచర్స్ యూనియన్ నాయకుల సమావేశంలో ఈ సందర్భంగా రాజా మాస్టారు ఉపాధ్యాయులందరికీ దిశా నిర్దేశం చేశారు. ఆన్లైన్ ఆప్ ద్వారా అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల ఆరో తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు . ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర వివిధ జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ప్రజలు ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా స్వీకరిస్తాం

ప్రతి డివిజన్ సమస్యను పరిష్కరిస్తాం: కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, నవంబర్ 4: ప్రభాతవార్త : గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులు ఘన విజయం సాధించిన నేపథ్యంలో బుధవారం స్థానిక హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని అందించిన గుంటూరు నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కాంగ్రెస్, వైసీపీకి అనుకూలంగా ఉన్న డివిజన్లలో సైతం కూటమి అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని గౌరవిస్తూ హుందాగా, పారదర్శకమైన ప్రజాపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అభ్యర్థులు గెలిచిన డివిజన్లలోనూ వివక్షకు తావులేకుండా సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించామని, నగరంలోని ఏ డివిజన్‌లోనూ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2021 ఎన్నికల నిర్వహణకు భిన్నంగా ఈసారి ఎన్నికలు జరిగాయని వ్యాఖ్యానించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తనకు, వైసీపీకి మధ్య 25 శాతం ఓట్ల తేడా ఉండగా, ప్రస్తుతం కూటమికి సుమారు 32 శాతానికి పైగా ప్రజల మద్దతు లభించిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ..

గుంటూరు నగరపాలక సంస్థలో కూటమి విజయం వెనుక ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి ఉందన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూనే వారంలో రెండు, మూడు రోజులు నియోజకవర్గంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పెమ్మసాని కృషి చేస్తున్నారని కొనియాడారు. 50 శాతం మహిళలు, 30 శాతం టీసీల ప్రాతినిధ్యంతో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కార్పొరేటర్లకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ..

వైసీపీ పాలనలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహించారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవిస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి రాత్రింబవళ్లు శ్రమించిన కూటమి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ.. గుంటూరు ప్రజలు అందించిన విజయం నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితమన్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రతి గడపను పలకరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని తెలిపారు.

జనసేన నాయకుడు కిలారి రోశయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం మరోసారి ఎన్నికల ద్వారా వెల్లడైందన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. మేయర్ లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించిన గుంటూరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పెమ్మసాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధిస్తూ నిధులు తీసుకురావడం, నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు విజయానికి కారణమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, రామాంజనేయులు సహా నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

మాట్లాడుతూ.. కూటమి మేయర్ అభ్యర్థితో పాటు కార్పొరేటర్లను గెలిపించిన గుంటూరు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఏకతాటిపైకి వచ్చి ప్రజల మద్దతు పొందాయని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు తాము పేర్కొంటున్న అవినీతి, దోపిడీకి తమ ప్రభుత్వంలో చోటు ఉండదని వ్యాఖ్యానించారు.

బుడమేరు పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు
అప్రమత్తంగా ఉండాలి

-విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,నవంబరు 4, ప్రభాతవార్త : బుడమేరు పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సూచించారు. బుధవారం సాయంత్రం మురును తుఫాను నేపథ్యంలో నగరంలో నెలకొన్న పరిస్థితులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపిఐఐసి కాలని, భారతినగర్, రెట్టింపు సంఖ్యలో ఆయిల్ మోటార్‌లను ఏర్పాటు చేసి,రహదారులపై నిల్చిన నీటిని వేగవంతంగా తొలగించాలని సూచించారు. పంటకాలువ రోడ్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు,తేలియాడే వ్యర్థాలు, గుర్రపుడెక్కలను పూర్తి స్థాయిలో తొలగిస్తూ డీ సిల్టింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బిఆర్‌టిఎస్ రోడ్డులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి,అక్కడ అందుబాటులో ఉన్న

శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలని,పంటకాలువ రోడ్డు,బిఆర్‌టిఎస్ రోడ్డు,సింగ్‌నగర్ పైపుల రోడ్డు,ఇన్నర్ రింగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి తుఫాను ప్రభావంతో ఏర్పడిన నీటి నిల్వలు,వాటి తొలగింపునకు అధికారులు చేపడుతున్న చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు,కొండ వాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో నగరం లోని రహదారులపై నీటి నిల్వలు ఏర్పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న మోటార్లకు అదనంగా వసతులను పరిశీలించారు. తదుపరి సింగ్‌నగర్ పైపుల రోడ్డు,ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి బుడమేరు ప్రవాహ పరిస్థితులను సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ రహదారులపై నీటి తొలగింపు చర్యలను వేగవంతం చేయడంతో పాటు ప్రధాన అవుట్‌ఫాల్ డ్రైన్లలో పేరు కుపోయిన పూడిక, వ్యర్థాలు ,గుర్రపుడెక్కలను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణమూర్తి, రామారావు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హాయ్‌ల్యాండ్‌లో ఈడీ సోదాలు

ఏపీపీఎస్సీ గ్రూప్1 మూల్యాంకన అవకతవకలపై ముమ్మర తనిఖీలు

మంగళగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త : మంగళగిరి మండలం చినకాకానిలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్ వేదికగా జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్1 మూల్యాంకన అవకతవకల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ముమ్మర సోదాలు నిర్వహిస్తున్నారు. ఇద్దరు అధికారులతో కూడిన ఈడీ ప్రత్యేక బృందం చినకాకాని హాయ్‌ల్యాండ్ ప్రాంగణంలో తనిఖీలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్ 1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ సాగుతోంది. ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాల్సిన అసలు జవాబు పత్రాలను చట్టవిరుద్ధంగా హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌కు తరలించి, దాదాపు 84 రోజుల పాటు అక్కడ ఉంచినట్లు గతంలో సిట్ విచారణలో తేలింది.

యూనివర్సిటీ ప్రొఫెసర్లతో కాకుండా ప్రైవేట్ వ్యక్తులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సహాయంతో జవాబు పత్రాల మార్కులను ఓఎంఆర్ షీట్లలోకి మార్పించారని, ఈ ప్రక్రియ కోసం ఒక ప్రైవేట్ సంస్థకు టెండర్లు లేకుండా రూ. 1 కోటికి పైగా నిధులు చెల్లించారని అధికారులు గుర్తించారు. నిబంధనలను తుంగలో తొక్కి సాగిన ఈ కుంభకోణంలో భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు వెల్లడి కావడంతో మనీ లాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగింది. విజయవాడ సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా విచారణను చేపట్టిన ఈడీ అధికారులు, ఆంధ్రప్రదేశ్‌లోని చినకాకాని హాయ్‌ల్యాండ్‌తో పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తూ కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కుప్పకూలిన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ప్రహరీ గోడ

పురాతన కట్టడాల పరిరక్షణపై ఆందోళన

మంగళగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త : చారిత్రక, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తున్న మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి మురుసు తుఫాన్ రూపంలో నష్టం వాటిల్లింది. సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన దేవస్థాన ప్రాంగణం లోని ప్రహరీ గోడ వర్షాల ప్రభావంతో కూలిపోయింది. ఎన్నో తరాలుగా భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు నిలయంగా ఉన్న ఆలయ ప్రహరీ గోడ కూలిపోవడంతో భక్తుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

వందల ఏళ్ల చరిత్రను తనలో ఇముడ్చుకున్న మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందింది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన దేవస్థానంలో పురాతన నిర్మాణాల పరిరక్షణ అత్యంత కీలకమైన అంశంగా మారింది. మురుసు తుఫాన్ ప్రభావంతో ఆలయ ప్రహరీ గోడ కూలిపోవడం పురాతన నిర్మాణాల పటిష్టతపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. వర్షపు నీరు గోడ పునాదులపై ప్రభావం చూపిందా? నిర్మాణం బలహీనపడటానికి ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలను సంబంధిత అధికారులు సాంకేతికంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

పురాతన కట్టడాల పరిరక్షణపై దృష్టి ఏదీ?

చారిత్రక ప్రాధాన్యం కలిగిన దేవస్థానాల్లో చిన్నపాటి నిర్మాణ లోపాలను కూడా ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ఒకవైపు ఆలయానికి వచ్చే భక్తుల భద్రత, మరోవైపు వందల ఏళ్ల చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరం. ప్రహరీ గోడ కూలిన ప్రాంతాన్ని వెంటనే పరిశీలించి, ప్రమాదకర పరిస్థితులు ఉంటే నివారణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

కూలిపోయిన ప్రహరీ గోడ స్థానంలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన పటిష్టమైన నిర్మాణం చేపట్టాలని, పునర్నిర్మాణ పనుల్లో ఆలయ పురాతన నిర్మాణ శైలికి ప్రాధాన్యత ఇవ్వాలని భక్తులు అభిప్రాయపడుతున్నారు. అవసరమైతే పురావస్తు, నిర్మాణ రంగ నిపుణుల సలహాలు తీసుకుని పనులు చేపట్టాలని సూచిస్తున్నారు. వర్షాకాలంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దేవస్థాన ప్రహరి గోడను బుధవారం దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శేఖర్, స్థపతి పరమేశ్వరరావు, దేవస్థాన ఈవో కోగంటి సునీల్ కుమార్ లు పరిశీలించారు.

విద్యుత్ లోపాలు తలెత్తకుండా అధికారులు
సమన్వయంతో పని చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ

ఎ కొండూరు, అక్టోబరు 4, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలోని 33బై11కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి

లక్ష్మీశ మాట్లాడుతూ మురసు తుఫాన్ అలజడి నేపథ్యంలో కంభంపాడు 33బై11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తీసుకోవలసిన భద్రతా చర్యలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు మురసు తుఫాన్ నష్ట నివారణకు తీసుకుంటున్న చర్యలను విద్యుత్తు సరఫరాలను అధికారులతో సమీక్షించారు అధికారులతో సమీక్షి ంచారు. అవసరమైన అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా అధికారుల అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ తుఫాను వల్ల ఎలాంటి విద్యుత్ సరఫరా లోపాలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని విద్యుత్ వినియోగదారులకు రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశా వెంట ఏ కొండూరు మండల తహసీల్దార్ వై నాగమణి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ టి.నటరాజు రెడ్డి, జెఈ జె.కోటేశ్వరరావు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాము విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు విద్యుత్ శాఖ రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు

1,827 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

724 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల నిఘా.. 69 హైపర్ సెన్సిటివ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

68 రూట్ మొబైల్ పార్టీలు, 29 ఫ్లైకింగ్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు

గుంటూరు,ప్రభాతవార్త: నేడు జిల్లాలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా 724 పోలింగ్ కేంద్రాల వద్ద మొత్తం 1,827 మంది పోలీస్, ఇతర సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల విధులపై పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

69 హైపర్ సెన్సిటివ్ ప్రాంతాలు

జిల్లాలోని 367 ప్రాంతాల్లో ఉన్న 724 పోలింగ్ కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. వీటిలో 69 ప్రాంతాల్లో 171 పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్‌గా, 46

నేడే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు

5వపేజీ తరువాయి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీల గుంపులు, ప్రచార కార్యక్రమాలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. 200 మీటర్ల పరిధిలో పార్టీ కండువాలు, గుర్తులతో నాయకులు, కార్యకర్తలు ఉండకూడదని, పోలింగ్ కేంద్రాల వద్ద ఒక్కో పార్టీకి ఒక పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండాలని ఆదేశించారు. ఓటర్లు మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, ఇంకు బాటిళ్లు వంటి నిషేధిత వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీలు చేయాలని సూచించారు. డబ్బు, మద్యం పంపిణీతో పాటు ఇతర అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

సమాచార వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

ఎన్నికల బందోబస్తులో విధులు నిర్వహించే ప్రతి సిబ్బంది సామర్థ్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఎస్పీ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ బటన్ ద్వారా సమాచారం అందించాలని, వైర్‌లెస్ వీఎచ్ఎఫ్ సెట్లు, సెల్‌ఫోన్ల ద్వారా ఉన్నతాధికారులు, పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని సూచించారు.

తుఫాను ప్రభావిత మండలాల్లోనూ పోలింగ్ యథావిధి

మురుసు తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, వరద నీటి కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడినప్పటికీ పెదనందిపాడు, కాకుమాను, ఫిరంగిపురం పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి అవసరమైన ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేశామని, ఓటర్లు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలకు రంగం సిద్ధం

రేపల్లె, నవంబరు 4, ప్రభాతవార్త: రేపల్లె మండలంలో ఎంపీటీసీ,జడ్పీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి బుధవారం ఏర్పాట్లు పూర్తయ్యాయి.17 ఎంపీటీసీ స్థానాల్లో 4 ఎంపీటీసీ స్థానాల ఎన్నికలు ఏకగ్రీవమైన నేపథ్యంలో 13 మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయి.17 ఎంపీటీసీ స్థానాల్లో జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు యధావిధిగా జరుగుతాయి.గురువారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని రేపల్లె మండల ఎన్నికల అధికారి ఎం.నాగయ్య తెలిపారు.పట్టణంలోని ఓల్డుటౌన్ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం కళ్యాణ మండపంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణనిచ్చి ఎన్నికల మెటీరియల్‌ను అందజేశారు.బ్యాలెట్ పత్రాలు,బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సిబ్బందికి పంపిణీచేసి తగిన సలహాలు,సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎం.నాగయ్య మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారమే పారదర్శకంగా ఎన్నికలను నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పోలింగ్ ముగిసాక బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్స్‌కు తరలిస్తామని చెప్పారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఓటర్ల కోసం క్యూ లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఓటు రహస్యానికి భంగం ఏర్పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.ఈ నెల 7వ తేదీ కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని చెప్పారు.మోళ్ళగుంట ప్రాదేశిక నియోజకవర్గం నుండి కొప్పనాతి రాజశేఖర్(తెదేపా), గంగడిపాలెం ప్రాదేశిక నియోజకవర్గం నుండి బద్దెల నాగజ్యోతి(తెదేపా),లంకెవానిదిబ్బ ప్రాదేశిక నియెజకవర్గం నుండి కొప్పనాతి వెంకటరమణ(తెదేపా),ఉప్పూడి ప్రాదేశిక నియోజకవర్గం నుండి దేవరకొండ సురేంద్రబాబు(తెదేపా) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన వివరించారు.రేపల్లె మండలంలోని గుడ్డికాయలంక ప్రాదేశిక

నియోజకవర్గ స్థానం నుండి యరగళ్ళ రామకృష్ణ(వైఎస్ఆర్సిపి),యరగళ్ళ వీరయ్య(తెదేపా),బేతపూడి-1 ప్రాదేశిక నియోజకవర్గం నుండి కారుమూరు ఏసుపాదం(తెదేపా), కారుమూరి రవికుమార్ (వైఎస్ఆర్సిపి),కారుమూరు ప్రియాంక (ఇండిపెండెంట్),బేతపూడి-2 ప్రాదేశిక నియోజకవర్గం నుండి వుయ్యూరు తిరుపతిరావు(వైఎస్ఆర్సిపి),పరుచూరి రాఘవ (తెదేపా), కొమరాబత్తుని మస్తాన్ రావు(ఇండిపెండెంట్), పేటేరు-1 ప్రాదేశిక నియోజకవర్గం నుండి కందుల సురేష్‌బాబు (వైఎస్ఆర్సిపి),మోర్ల వెంకటసుబ్బారావు(తెదేపా), పేటేరు-2 ప్రాదేశిక నియోజకవర్గం నుండి రెబ్బా నాగమణి(వైఎస్ఆర్సిపి),చందోలు సుధ(తెదేపా),కారుమూరు ప్రాదేశిక నియోజకవర్గం నుండి రామాయణం నాగభద్రయ్య(జనసేన),రామాయణం రత్తయ్య(వైఎస్ఆర్సిపి), చోడాయపాలెం ప్రాదేశిక నియోజకవర్గం నుండి తోట శ్రీదేవి(జనసేన),నముద్రాల సునీత(వైఎస్ఆర్సిపి) ,కె.శ్రుతి(ఇండిపెండెంట్),కామరాజుగడ్డ ప్రాదేశిక నియోజకవర్గం నుండి లింగినేని లక్ష్మి(తెదేపా),కేసన సునీత (వైఎస్ఆర్సిపి), పెనుమూడి ప్రాదేశిక నియోజకవర్గం నుండి కర్రా రాంబాబు (వైఎస్ఆర్సిపి),దారం విజయరాజు(తెదేపా),తుమ్మల ప్రాదేశిక నియోజకవర్గం నుండి జి.కల్పన(జనసేన),రేపల్లె రజని(వైఎస్ఆర్సిపి), పోటుమెరక ప్రాదేశిక నియోజకవర్గం నుండి కాగితాల లీలాకృష్ణ(తెదేపా),రేపల్లెశ్రీకాంత్(వైఎస్ఆర్సిపి),మండలి సాంబశివరావు (ఇండిపెండెంట్),చాట్రుగడ్డ ప్రాదేశిక నియోజకవర్గం నుండి మండే నాగలక్ష్మి(వైఎస్ఆర్సిపి),ఆలూరి సౌమ్య(తెదేపా), నల్లూరిపాలెం ప్రాదేశిక నియోజకవర్గం నుండి సుఖవాసి రాజ్యలక్ష్మి(వైఎస్ఆర్సిపి), నజ్జా సుజాత(తెదేపా)లు పోటీ చేస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎం.నాగయ్య వివరించారు.ఈ కార్యక్రమంలో రేపల్లె తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు,మండల పరిషత్ కార్యాలయం అధికారులు,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 46 ఎంపీటీసీలకు ఎన్నికలు..

రేపల్లె నియోజకవర్గంలోని 65 మండల ప్రాదేశిక నియోజకవర్గాలలో 19 మండల ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు ఏకగ్రీవమయా య్యి.చెరుకుపల్లి మండలంలో 2,రేపల్లె మండలంలో 4,నిజాంపట్నం మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.చెరుకుపల్లి మండలంలో 15,నగరం మండలంలో 14,రేపల్లె మండలంలో 13,నిజాంపట్నం మండలంలో 4 ఎంపీటీసీ స్థానాలకు,నాలుగు మండలాల జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

సార్వత్రిక విద్యాపీఠం అధ్వర్యంలో పది,ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ

బాపట్ల,నవంబర్4,ప్రభాతవార్త.ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి పదో తరగతి,ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు.స్థానిక కార్యాలయంలో బుధవారం డీఈవో మాట్లాడుతూ అర్హత కలిగిన అభ్యర్థులు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా నవంబరు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఆ తర్వాత రూ.200 ఆలస్య రుసుముతో నవంబరు 16 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.వివిధ కారణాలతో చదువును మధ్యలో ఆపేసిన వారు, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.అర్హత గల అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.పూర్తి వివరాల కోసం సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల సమన్వయకర్తలను సంప్రదించాలన్నారు.ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి, విద్యార్థులు, చదువును మధ్యలో ఆపేసిన వారిని దరఖాస్తు చేసుకునేలా మండల విద్యాశాఖ అధికారులు, ఏపీ కోఆర్డినేటర్లు, సీల్డీలు కృషి చేయాలని కోరారు.

అండర్-16 ఆంధ్ర క్రికెట్ జట్టుకు బాపట్ల కుర్రాడు

వరుసగా మూడోసారి రాష్ట్ర జట్టుకు ఎంపికైన అబ్దుల్ సాద్ ఉనైస్

విజయ్ మర్చంట్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం

జోన్ స్థాయి మ్యాచ్‌ల్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా

బాపట్ల,నవంబర్4,ప్రభాతవార్త.ప్రతినిధి: చిన్ననాటి నుంచే చదువుతోపాటు క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న బాపట్ల పట్టణానికి చెందిన విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్ అండర్-16 ఆంధ్ర క్రికెట్ జట్టులో స్థానం సంపాదించి ప్రతిభ చాటాడు. రాష్ట్ర స్థాయి జట్టుకు వరుసగా మూడుసార్లు ఎంపిక కావడం విశేషం.బాపట్ల ఇస్లాంపేటకు చెందిన ఈ యువ క్రికెటర్ విజయ్ మర్చంట్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు తరఫున ఆడేందుకు ఎంపిక కావడంతో పట్టణ క్రికెట్ వర్గాల్లో హర్షం వ్యక్త మవుతోంది.

బాపట్ల పట్టణంలోని జమీందారుపేటలో ఉన్న ఎంసీఏ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న అబ్దుల్ సాద్ ఉనైస్ ఎంపిక వివరాలను అకాడమీ కోచ్ సయ్యద్ అమీర్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన అండర్-16 గుంటూరు జిల్లా సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సంపాదించాడన్నారు.అనంతరం జులైలో జరిగిన అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో గుంటూరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించడంతో జోన్‌జట్టుకు ఎంపికయ్యాడన్నారు.

సెప్టెంబరులో విశాఖపట్నంలో నిర్వహించిన జోన్ స్థాయి మ్యాచ్‌ల్లో రెండు మ్యాచ్‌లు ఆడిన అబ్దుల్ సాద్ ఏకంగా 192 పరుగులు సాధించడంతోపాటు మూడు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడన్నారు. ఈ ప్రదర్శన ఆధారంగా ప్రతిష్టాత్మకమైన అండర్-16 విజయ్ మర్చంట్ ట్రోఫీకి ఆంధ్ర జట్టులో చోటు దక్కించుకున్నాడన్నారు. నవంబరు 14 నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ పోటీలు ప్రారంభం అవుతాయన్నారు.ఈ టోర్నీలో ఆంధ్ర జట్టు ఢిల్లీ, ముంబై, కేరళ, జమ్మూకశ్మీర్, తమిళనాడు జట్లతో తలపడనుందన్నారు.

జిల్లాకు గర్వకారణం:

బాపట్ల జిల్లా నుంచి అండర్-16 ఆంధ్ర జట్టుకు ఎంపికైన ఏకైక విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్ అని బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకమ్మ చౌదరి తెలిపారు. చిన్న వయసులోనే వరుసగా మూడుసార్లు రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించడం అభినందనీయమన్నారు. విజయ్ మర్చంట్ ట్రోఫీలోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బాపట్ల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. జిల్లాలో క్రికెట్‌పై ఆసక్తి చూపుతున్న చిన్నారులకు అబ్దుల్ సాద్ స్ఫూర్తిగా నిలవాలన్నారు. అతనికి బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎంసీఏ అకాడమీ కోచ్ సయ్యద్ అమీర్ మాట్లాడుతూ తమ అకాడమీలో శిక్షణ పొంది అబ్దుల్ సాద్ వరుసగా మూడుసార్లు ఆంధ్ర జట్టుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. గత ఏడాది తమ అకాడమీ తరఫున మహబూబ్ వలి అండర్-14 రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని, పలువురు చిన్నారులు అండర్-14 జిల్లా జట్టులో స్థానం సంపాదించారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ, నిరంతర సాధనతో యువ క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు.

అబ్దుల్ సాద్ ఉనైస్ ఆంధ్ర జట్టుకు ఎంపిక కావడంపై బాపట్ల క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు రఘునాథ్, రోశయ్య, బంధా బాబు, దుప్పలపూడి రామ్మోహన్, జయరాం రెడ్డి, నరేష్, స్టాంప్లీ విమల్‌కుమార్, చిన్న రోశయ్య, వెంకట్రావు, పఠాన్ రాజేష్, కొమరవోలు శ్రీనివాసరావు, ఎం.శ్రీను,ఎంసీఏ అకాడమీ డైరెక్టర్ కరేములా తదితరులు అభినందించారు.

ఆర్ అండ్ బి రహదారి పై
మురుగు నీటి ప్రవాహం

పట్టించుకోని అధికారులు

ఎ కొండూరు, అక్టోబరు 4, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజవర్గం ఏ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో నూజీవీడు గంపలగూడెం ఆర్ అండ్ బి రాష్ట్ర రహదారికే గత ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో చీమలపాడు గ్రామంలోని ప్రజలు కొద్దిపాటి వర్షాలకు తుఫాను ప్రభావంతో కురిసిన వరదలకు తోడు మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో వాహన చోదకులు ప్రయాణికులు పాదచార్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు గత ఎన్నో ఏళ్లుగా ఈ నూజీవీడు గంపలగూడెం రాష్ట్ర రహదారిని అధికారులు డబల్ రోడ్డుగా మార్పు చేయకపోవడంతో

కొందరు గ్రామంలో రోడ్డును ఆక్రమించుకొని ఉండటం వల్ల మురుగునీరు వెళ్ళటానికి డ్రైవర్ సౌకర్యం సరిగా లేక రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తుండటం కారణమని గ్రామ ప్రజలు ఆర్ అండ్ బి శాఖ అధికారుల నిరక్ష్య వైఖరిని తీరును ప్రజలు విమర్శించారు ఇకనైనా ఈ నూజీవీడు గంపలగూడెం ఆర్ అండ్ బి రాష్ట్ర రహదారిని వెంటనే డబల్ రోడ్డుగా మార్పు చేసి రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి ఈ గ్రామంలో రహదారిపై మురుగునీరు ప్రవహించకుండా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయాలని లేని పక్షంలో సంబంధిత ఆర్ అండ్ బి శాఖ మైలవరం తిరువూరు నూజీవీడు అధికారుల నిరక్ష్య వైఖరి పట్ల ఆందోళనలు చేపడతామని ప్రజలు సోషల్ యాక్టివిస్టులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పదవిని బాధ్యతగా భావించండి

నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు అభినందనలు తెలిపిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు పొలిటికల్, నవంబర్ 4,ప్రభాతవార్త : నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను నూతనంగా

ఎన్నికైన నియోజకవర్గ కార్పొరేటర్లు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి కార్పొరేటర్లను గెలిపించారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేయాలని సూచించారు. ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్పొరేటర్లు ముందంజలో ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ ప్రభుత్వాధికారులు దృష్టికిగానీ, మా దృష్టికిగానీ వెంటనే తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని స్పష్టం చేశారు . పదవి అనేది బాధ్యత మాత్రమేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ సారథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

21వ శతాబ్దం ఆసియా శతాబ్దం

తెలంగాణాఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

పొన్నూరు, నవంబరు 4,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో లీగల్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొఫెషన్, చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చట్ట విద్య న్యాయవృత్తిలో వస్తున్న మార్పులు, ఆధునిక న్యాయ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన

తెలంగాణా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ 21వ శతాబ్దం ఆసియా శతాబ్దంగా నిలవనుందని, ప్రపంచ న్యాయ, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో భారత్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. అంతర్జాతీయ వాణిజ్య చట్టాలు, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ వాణిజ్య సంస్థ, బ్రెట్టన్ వుడ్స్ సంస్థలపై న్యాయ విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, డిజిటలైజేషన్ వంటి పరిణామాలు న్యాయ వ్యవస్థపై చూపుతున్న ప్రభావాన్ని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో న్యాయవాదులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. అంతరిక్ష చట్టాలు, సముద్ర చట్టాలు, ఉపగ్రహ సాంకేతికతకు సంబంధించిన న్యాయవరమైన అంశాల్లో భవిష్యత్తులో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు పుస్తక పఠనానికి ప్రాధాన్యతనిస్తూ నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మరో అతిథి తెలంగాణా హైకోర్టు న్యాయవాది అడ్వకేట్ భూమి సునీల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయం అందించడంలో గ్రామ న్యాయాలయాల ప్రధాన్యతను వివరించారు. భూ చట్టాలు న్యాయవృత్తిలో ఎప్పటికీ ప్రాధాన్యత కలిగిన రంగమని, ఈ విభాగంలో న్యాయవాదులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యాభ్యాస దశ నుంచే సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, గ్రామీణ ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. రైతుల హక్కులు, వ్యవసాయ చట్టాల ప్రధాన్యతను వివరిస్తూ...సమాజంలోని సమస్యల పరిష్కారానికి న్యాయ విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ న్యాయవృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, సమాజంలో సానుకూల మార్పు తీసుకురాగల శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. సమాజం, రైతులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. న్యాయ పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమానికి వినియోగిస్తూ సామాజిక బాధ్యత కలిగిన న్యాయవాదులుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముఖాముఖి చర్చలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రైవేటు అంతరిక్ష సంస్థల నియంత్రణ, అంతర్జాతీయ న్యాయ నిబంధనల ప్రకారం వాటి బాధ్యతలు, అంతర్జాతీయ వాణిజ్య చట్టాలు అంతరిక్ష చట్టాల పరిణామాలపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల సందేహాలకు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సమాధానాలిస్తూ...అభివృద్ధి చెందుతున్న ఈ రంగాల్లోఇ నవాళ్ళు, అవకాశాలను వివరించారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల నష్టాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు

కొల్లివర, నవంబరు 4, ప్రభాతవార్త: మండలంలోని వల్లభాపురం గ్రామంలో మురసు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను బుధవారం అంగూరు వైస్ ఛాన్స్‌లర్ పి.వి.సత్యనారాయణ,లాం ఎడిఆర్ దుర్గాప్రసాద్,డిడిఎ సునీత,ఎడిఎ తెనాలి విజయబాబు,మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.పంట పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని పొలం

బయటకు పంపాలని సూచించారు.ప్రధాన,పిల్ల కాల్వలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఈదురు గాలులకు వరి పంట పడిపోతే నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు.పంట కోతకు రాని దశలో ఉంటే నీటి నిల్వలను తొలగించాలని తెలిపారు.పొలంలో నీరు తగ్గాక అవసరాన్ని బట్టి పోషక యాజమాన్యం చేపట్టాలని శాస్త్రవేత్తలు వివరించారు.ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తిరువూరులో 150 పోలీసులతో ఎంపిటిసి జడ్పీటిసి ఎన్నికలకు బందోబస్తు

తిరువూరు, నవంబర్ 4, ప్రభాతవార్త : ఎంపిటిసి జడ్పీటిసి ఎన్నికల నేపథ్యంలో తిరువూరులో 150మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏడిసిపి ఎన్.వెంకట రమణ, మైలవరం ఏసిపి పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ల నిర్వహణకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సహకారం తీసుకోనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. తిరువూరు సిఐ గురు ప్రకాష్, ఎస్ఐ శాతకర్ణి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి

ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్

పొన్నూరు, నవంబరు 3,ప్రభాతవార్త: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ పిలుపు నిచ్చారు. పొన్నూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కొంత మంది ఆర్యవైశ్య సోదరులు నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో ఆగిన రైలు ప్రయాణికులకు బిర్యాని, బిస్కట్లు, పండ్లు తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి ప్రకాష్ మాట్లాడుతూ మురసు తుఫాను కారణంగా సికింద్రాబాదు నుండి తిరుపతి వెళ్ళాల్సిన పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలును నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో అర్ధాంతరంగా నిలిపివేశారు. నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో విషయం తెలుసుకున్న వాసవిక్లబ్ స్పందించి, ఆర్యవైశ్య సోదరులను కలుపుకొని తలా కొంత నగదుతో ప్రయాణీకుల ఆకలిని తీర్చేందుకు వెటిటబుల్ బిర్యాని, వాటర్ బాటిల్స్,బిస్కట్ ప్యాకెట్లు, టీ పంపిణీ చేశారు. విషయం తెలుసుకొని స్పందించిన వాసవిక్లబ్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, లక్ష్మీ వెంకటేశ్వర చిట్స్, ఆర్యవైశ్య సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసమూర్తి, ఆకి కిషోర్, గాదంశెట్టి సతీష్, అన్నవరపు నాగ వెంకటకృష్ణారావు, సొజన్య టైపు ఇనిస్టిట్యూట్ అధినేత సంకా విజయప్రసాద్, ధనుంజయ, ఆనంద్, సత్యం, గోడ్రేజ్ శివ తదితరులు పా

మురసా ప్రభావంతో జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను : ప్రత్తిపాటి

ప్రత్తిపాటివిద్యుత్ శాఖకు రూ.600 కోట్ల మేర నష్టం వాటిల్లింది : మంత్రి గొట్టిపాటి..

నియోజకవర్గంలో తుఫాను ప్రభావిత ప్రాంతాలు, నీటమునిగిన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మంత్రి గొట్టిపాటి

వర్షంలోనూ వేగంగా విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టిన విద్యుత్ యంత్రాంగాన్ని అభినందిస్తున్నాం : గొట్టిపాటి

చిలకలూరిపేట,నవంబరు 4,ప్రభాతవార్త : మురసా ప్రభావంతో నియోజకవర్గంలో ఎక్కువ నష్టం జరిగిందని, ముఖ్యంగా రైతాంగానికి పూడ్చలేని విధంగా భారీ నష్టం వాటిల్లిందని, పత్తి, మిరప, వాణిజ్యపంటలు నీళ్లలో తేలుతున్న దృశ్యాలు చూస్తుంటే బాధ కలిగిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం ప్రత్తిపాటి, పల్నాడు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, విద్యుత్ శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లాతో కలిసి చిలకలూరిపేట నియోజకవర్గంలో మురసా తుపాన్

ధాటికి నీటమునిగిన ప్రాంతాలు, పొలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మంత్రి పలుచోట్ల ప్రజలు, రైతులతో మాట్లాడి, వారికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. తుపాను బాధితుల నిర్వాసిత కేంద్రాలకు వెళ్లి, వారి సమస్యలు తెలుసుకున్న అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.

విద్యుత్ శాఖకు రూ.600 కోట్లవరకు నష్టం : మంత్రి గొట్టిపాటి

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే రాష్ట్రంపై మురసా విరుచుకుపడిందని, ఒంగోలు సమీపంలో తీరందాటాక, చిలకలూరిపేటపై ఎక్కువ ప్రభావం పడిందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అర్నబ్ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి అంబేద్కర్ కోనసీమ వరకు విద్యుత్ వ్యవస్థ బాగా దెబ్బతిందన్నారు. ఇంతటి విపత్కర పరిస్థుతుల్లోనూ విద్యుత్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారని గొట్టిపాటి చెప్పారు. అర్నబ్, మురసా ప్రభావంతో రాష్ట్రంలో 10వేలకు పైగా కరెంట్ స్తంభాలు నేలకొరిగాయని, వందల కిలోమీటర్ల మేర లైన్లు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. తుఫాన్ల నష్టంతో రాష్ట్ర విద్యుత్ శాఖకు రూ.500 నుంచి 600 కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్నారు. చిలకలూరిపేటలో అర్థరాత్రి కూడా విద్యుత్ సిబ్బంది పనిచేశారని, బుధవారం సాయంత్రానికి అన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణ పూర్తవుతుందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. సకాలంలో స్పందించి వేగంగా విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టిన యంత్రాంగాన్ని, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు మంత్రి చెప్పారు.

జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతాను : ప్రత్తిపాటి

మురసా తుపాను ప్రభావంతో గత 30 ఏళ్లలో ఎన్నడూ జరగనంత నష్టం నియోజకవర్గంలో జరిగిందని, తీరం దాటాక నాలుగ్గంటలపాటు చిలకలూరిపేటపై కుంభవృష్టి కురిసిందని, నా రాజకీయ జీవితంలో ఇంత తీవ్రనష్టాన్ని చూడలేదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోనే 600కు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, రైతాంగానికి పూడ్చలేని నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా పత్తి, మిరప, ఉద్యానపంటలు నీటమునిగాయన్నారు. తుపాను తీవ్రతను గమనించి ప్రభుత్వం, యంత్రాంగం ముందే ప్రజల్ని హెచ్చరించిందని, దాంతో చాలావరకు ప్రాణ నష్టం తగ్గిందన్నారు.

నియోజకవర్గంలో ఇద్దరు మరణించారని ప్రభుత్వపరంగా వారి కుటుంబాలను ఆదుకుంటామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే స్పష్టంచేశారు.పట్టణంలో పలువార్డులు నీటమునిగాయని, వెంటనే ప్రజల్ని నిర్వాసిత కేంద్రాలకు తరలించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, సమర్థ పనితీరువల్లే రాష్ట్రంలో మురసా ప్రభావ నష్టాన్ని తగ్గించగలిగారని ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గానికి భవిష్యత్ లో వరద ముప్పు లేకుండా ఉండాలంటే వెంటనే, ప్రధాన వాగులైన కుప్పగంజి, ఓగేరు, నక్క వాగుల్ని ఆధునీకరించాలని ప్రత్తిపాటి తెలిపారు. ప్రవాహానికి అడ్డుగా ఉన్న కంపచెట్లు, పూడికను తొలగించి, మూడు వాగుల్ని విస్తరిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. వాగుల సమస్యను ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఇన్ చార్జ్ మంత్రి గొట్టిపాటికి తెలియచేసినట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తోట రాజరాజేశ్వరి, జనసేన ఇంచార్జి తోట రాజరమేష్, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు ముల్లా కరిముల్లా, మద్దిబోయిన శివ, షేక్ మస్తాన్ వలి, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత భారత దేశ నిర్మాణమే లక్ష్యం

ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకే.రవికృష్ణ

మంగళగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త : మత్తు రహిత భారత దేశ నిర్మాణమే లక్ష్యమని ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకే. రవికృష్ణ అన్నారు. ఫైట్ ఎగనెస్ట్ డ్రగ్స్ యునైటెడ్ ఫర్ ఎ డ్రగ్ ఫ్రీ ఇండియా నినాదం తో ఆంధ్రప్రదేశ్ నుంచి గుజరాత్ లోని ఏక్తా నగర్ వరకు నిర్వహించిన జాతీయ మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎనిమిది మంది పోలీస్ సిబ్బందిని ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకె రవికృష్ణ మంగళగిరి లోని ఈగల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మాదకద్రవ్యాల సమస్య కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి

సంబంధించినది మాత్రమే కాదని, యువత భవిష్యత్తుతో పాటు సమాజానికి, దేశ భద్రతకు కూడా తీవ్రమైన ముప్పుగా మారుతోందని పేర్కొన్నారు. అందుకే డ్రగ్స్‌పై పోరాటాన్ని దేశ భవిష్యత్తును కాపాడే బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై పోరాటం దేశ భవిష్యత్తును, భద్రతను కాపాడే పోరాటం అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నశా ముక్త్ భారత్ అభియాన్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో ఈగల్ సంస్థ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణతో పాటు యువతలో విస్తృత అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు.మాదకద్రవ్యాల నిర్మూలన అనే గొప్ప లక్ష్యంతో చేపట్టిన ఈ జాతీయ బైక్ ర్యాలీలో పాల్గొని, డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి గుజరాత్ వరకు తీసుకెళ్లడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరికీ జీవితంలో కొన్ని అరుదైన, అద్భుతమైన అవకాశాలు లభిస్తాయని, ఈ జాతీయ బైక్ ర్యాలీలో పాల్గొనడం కూడా అలాంటి గొప్ప అవకాశమేనని పేర్కొన్నారు.ఈ ప్రయాణంలో పొందిన అనుభవాలు, జ్ఞాపకాలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. 2013లో తాను రాష్ట్రం తరఫున హాట్ స్ప్రింగ్స్ ప్రాంతానికి వెళ్లిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. వివిధ రాష్ట్రాల పోలీస్ అధికారులు, కేంద్ర భద్రతా బలగాల ప్రతినిధులతో కలిసి ఆ చారిత్రక ప్రాంతాన్ని సందర్శించిన జ్ఞాపకాలు 13 సంవత్సరాల తర్వాత కూడా తనకు స్పష్టంగా గుర్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఈగల్ హెడ్ కానిస్టేబుల్ జవహర్ ర్యాలీకి కొద్ది రోజుల ముందే అవకాశం వచ్చినప్పటికీ స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. రైడర్లు కుటుంబాలకు దూరంగా ఉండి ఈ జాతీయ కార్యక్రమంలో పాల్గొనడం, అందుకు వారి కుటుంబ సభ్యులు సహకరించడం కూడా ఎంతో గొప్ప విషయమని ప్రశంసించారు.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 31న గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరిగిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ బృందం పాల్గొనడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

దేశ ఐక్యత, సమగ్రతతో పాటు డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణం కోసం చేపట్టిన ఈ జాతీయ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ బృందం పాల్గొనడం గర్వకారణమని, ఈగల్ సంస్థకు భాగస్వామ్యం కల్పించిన ఏపీఎస్పీ బెటాలియన్ల అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ప్రోత్సాహం అందించిన ఆంధ్ర రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, , ఐజీ బెటాలియన్స్ శ్రీకాంత్ కు ఈగల్ సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా బైక్ రైడర్లు ఈగల్‌ను తమ సొంత కుటుంబంగా భావించి, ఎక్కడ పనిచేసినా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన పోలీస్ సిబ్బంది నిబంధనలు, ఖాళీలకు అనుగుణంగా ఈగల్‌లో పనిచేసే అవకాశాలను వినియోగించుకోవచ్చని తెలిపారు. జాతీయ బైక్ ర్యాలీలో పాల్గొన్న కమాండెంట్ పీఎండీ ప్రసాద్, ఆర్ఐ వి.ఎల్. చంద్రశేఖర్, ఈగల్ హెడ్ కానిస్టేబుల్ జవహర్, 14వ బెటాలియన్‌కు చెందిన పీసీ లు నవీన్, షేక్షవలి, నరసింహులు, నాగచెన్నారెడ్డి, పీసీ విజయ్ భాస్కర్, నవీన్ ను ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్నవారు మోనం వీడి ఈగల్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1972కు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈగల్ ఆపరేషన్స్ ఎస్పీ మహేశ్వర రాజు, అడ్మిన్ ఎస్పీ స్వరూప రాణి, స్పెషల్ పీపీ శైలజ, డిఎస్పీ, అకౌంట్స్ ఆఫీసర్ జయలక్ష్మి, టి.దుర్గా ప్రసాద్, డీఎస్పీ వి.వేణు గోపాల్ రెడ్డి, సిఐ రవి, సీఏఓ (అనలిటిక్స్) వాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉస్మాన్ భాష ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేట మున్సిపల్ పీఠం జనసేన కైవసం!

ప్రత్యర్థులపై 29,194 ఓట్ల రికార్డు మెజారిటీతో తోట రాజరాజేశ్వరి ఘన విజయం

చిలకలూరిపేట,నవంబరు 4,ప్రభాతవార్త : చిలకలూరిపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రభంజనం సృష్టించింది. మున్సిపల్ చైర్మన్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో జనసేన అభ్యర్థి తోట రాజరాజేశ్వరి సమీప ప్రత్యర్థిపై ఏకంగా 29,194 ఓట్ల భారీ మెజారిటీతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకున్నారు.ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచే జనసేన అభ్యర్థి తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించారు. తుది ఫలితాలు వెల్లడయ్యేసరికి తోట రాజరాజేశ్వరికి మొత్తం 41,282 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి పార్టీలైన వైఎస్సార్‌సీపీకి 12,088 ఓట్లు, కాంగ్రెస్‌కు 4,595 ఓట్లు మాత్రమే లభించాయి. సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై రాజరాజేశ్వరి భారీ ఆధిక్యంతో జయకేతనం ఎగురవేశారు.

పోలైన ఓట్ల వివరాలు: తోట రాజరాజేశ్వరి (జనసేన): 41,282 .. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి: 12,088 .. కాంగ్రెస్ అభ్యర్థి: 4,595 .. మెజారిటీ: 29,194 ఓట్లుపట్టణంలో జనసేన శ్రేణుల సంబరాలురాజరాజేశ్వరి రికార్డు స్థాయి మెజారిటీతో విజయం సాధించడంతో పట్టణంలో జనసేన శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ తోట రాజరాజేశ్వరి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో గెలిపించిన పట్టణ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చిలకలూరిపేట సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

పంటపోలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

చిలకలూరిపేట,నవంబరు 4,ప్రభాతవార్త : గత రెండు రోజులుగా పల్నాడు జిల్లాలోని ఎడ్లపాడు, చిలకలూరిపేట నాదెండ్ల మండలాల్లో మురసు తుఫాను ప్రభావంతో కురిసినటువంటి గాలి మరియు తీవ్ర వర్షం పంటలను అతలాకుతలం చేసినాయి. ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డి సంపత్ కుమార్ అలాగే కంట్రోలర్ డాక్టర్ బి ముకుందరావు అలాగే ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మరియు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్ ప్రధాన శాస్త్రవేత్త సత్య గోపాల్‌జంగమహేశ్వర పురం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సైదా నాయక్ అలాగే పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ జగ్గారావు వ్యవసాయ సహసంచాలకులు నరసరావుపేట శ్రీ శ్రీనివాస రావు అలాగే స్థానిక వ్యవసాయ అధికారులు హరిప్రసాద్ శ్రీమతి సరిత మరియు శ్రీమతి శ్రీలత ఎడ్లపాడు చిలకలూరిపేట మరియు నాదెండ్ల మండలంలో సాగుతున్నట ఎంటి వివిధ పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు

అందజేశారు. పత్తిలో నిలబడిఉన్న నీళ్ళని పూర్తిగా తీసివేయాలి తీసివేసిన తర్వాత బూస్టర్ డోస్ గా ఎకరానికి 25 నుంచి 30 కిలోలు యూరియా 10 కిలోలుపొటాష్ వేసుకోవాలి. ఈ వర్షాల వల్ల పత్తిలో ఆకు మచ్చ మరియు కాయ కుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది కాబట్టి తెగులు నివారణకు ఎకరాకు 600 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా హెక్సాకొనాజోల్ 400 మిల్లీలీటర్ల చొప్పున లేదా సాఫ్ 2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి చొప్పున చొప్పున 10 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి. పై పాటుగా మల్టీకే గాని లేదా 19 19 19 గాని ఎకరానికి ఒక కేజీ చొప్పున వాడుకోవాలి. వరి పూత దశలో ఉన్నప్పుడు పంట వర్షానికి అయినట్లయితే తాలు గింజలు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి పూతనుంచి పాలు పోసుకునే దశలో పై పాటుగా ప్రొఫికోనజోల్ 200 ఎకరానికి స్ప్రే చేసుకోవాలి. గింజ తయారు అయిపోయి కోతకు సిద్ధంగా ఉన్న వరిలో వరి ముంపు గురై ఉన్నట్టు అయితే విత్తనం కలర్ చేంజ్ అవ్వకుండా ఉండటం కోసం మొలక రాకుండా ఉండటం కోసం 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలి. వరి నోటి ముంపుకు గురై పడిపోయినటు వంటి పరిస్థితుల్లో వాటిని నిలబెట్టుకోవటం నీళ్ల మొత్తం పూర్తిగా పొలాల నుంచి తీసేటట్టు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం

సుస్థిర ఆహార వ్యవస్థలపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన

మాచర్ల టౌన్ నవంబర్ 4 ప్రభాతవార్త: బ్రిక్స్(తీళిఐదీ) సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా మాచర్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నాలుగో రోజు కార్యక్రమాన్ని బుధవారం స్థానిక బస్‌స్టాండ్‌లో నిర్వహించారు.డిపో మేనేజర్

మార్గరెట్ ఆధ్వర్యంలో సుస్థిర ఆహార వ్యవస్థల స్వీకరణ అనే అంశంపై డిపో సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోషకాహార నివుణులు డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ...ఆరోగ్యకరమైన జీవనానికి సమతుల ఆహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు, సేంద్రియ ఆహార పదార్థాలను నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.అధిక కొవ్వు, ఉప్పు, చక్కెర కలిగిన పదార్థాలు, జంక్‌ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు.ప్రతిరోజూ నిర్ణీత సమయానికి భోజనం చేయడం, తగినంత నీరు త్రాగడం, వంటల్లో నాణ్యమైన నూనెలను పరిమితంగా వినియోగించడం వంటి అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని వివరించారు. ఆహార నియమాలతో పాటు నడక, యోగా, వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.అలాగే ఆహార పదార్థాలను వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వినియోగించాలని, స్థానికంగా లభించే కాలానుగుణ పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మద్యపానం, ధూమపానం వంటి అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉంటూ పర్యావరణహితమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ, సమాజ ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మార్గరెట్‌తో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ సహాయక చర్యలలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రమ్య

విస్తృతంగా లోతట్టు ప్రాంతాలలో పర్యటన, సహాయ చర్యలు

నరసరావుపేట, నవంబర్ 4 (ప్రభాతవార్త): ఒకవైపు ఎన్నికల విధులు.. మరోవైపు మురసు తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలలో మున్సిపల్ కమిషనర్ బి రమ్య కీర్తన విధులను విజవంతంగా నిర్వహించారు. భారీ వర్షాలు అయినప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కమిషనర్ బి. రమ్య కీర్తన నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయక చల్యను పర్యవేక్షిస్తున్నారు. తుఫాన్‌ను లెక్కచేయకుండా మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బందితో ప్రజలకు సహాయక సేవలు అందించారు.పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో కూలిన చెట్లు, హోర్డింగ్‌లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.త్రాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలకుండా ఇంజనీరింగ్ విభాగం అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు శానిటేషన్ అధికారులు, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మున్సిపల్ కార్యాయంలో అత్యవసర సహాయం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు ఏవైనా సస్యలు ఎదుర్కొంటే అత్యవసర సహాయం కోసం మున్సిపల్ కార్యాలయాన్ని నేరుగా ఫోన్ ద్వారా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.అధికారులు, సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేస్తూ, తానే స్వయంగా సహాయక కార్యక్రమాల్లో కమినర్ రమ్య కీర్తన ప్రజల భద్రతకు ప్రాధాన్యతతో పర్యవేక్షించారు . తుఫాన్ సమయంలో ప్రజకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ శాఖ అధికారులకు కమిషనర్ బి రమ్య కీర్తన ఎప్పటికప్పుడు సూచనలు ఆదేశాలు ఇచ్చారు .

ఘన విజయం మరింత బాధ్యతను పెంచింది

రెండేళ్ల ప్రజాపాలన విశ్వాసాన్ని పెంచింది...పట్టణ సుందరీకరణకు కౌన్సిల్ సభ్యులు పాటుపడాలి...విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల టౌన్ నవంబర్ 4 ప్రభాతవార్త: మాచర్ల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అన్నీ వార్డులను క్లీన్ స్వీప్ చేస్తూ సాధించిన ఘన విజయం పట్టణ సర్వతోముఖాభివృద్ధికి మరింత బాధ్యతను పెంచిందని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో 36 వార్డులకు గానూ 36 వార్డు కౌన్సిలర్ స్థానాలను,23,191 ఓట్ల భారీ మెజారిటీతో చైర్పర్సన్ అభ్యర్థి యెనుముల

సుష్మాకేశవరెడ్డి అఖండ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఒక్కొక్క కౌన్సిలర్ సభ్యునితో ఒక్కో కేక్ చొప్పున 36 కేకులను వారి కుటుంబ సభ్యులు, గెలుపుకు సహకరించిన కూటమి శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి,ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం చైర్ పర్సన్ అభ్యర్థి సుష్మాకేశవరెడ్డి దంపతులతో భారీ కేక్ కట్ చేసి, ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జూలకంటి మాట్లాడుతూ...భారీ మోజారిటీతో వంద శాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించిన సభ్యులందరూ పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. రెండేళ్ల ప్రజాపాలన మరింత విశ్వాసాన్ని పెంచిందికూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రజా పాలన చూసిన ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతపై మరింత విశ్వాసాన్ని పెంచుకున్నారని, విధ్వంసమైన వ్యవస్థను గాడినపెట్టి, సందప సృష్టించేందుకు అహర్నిశలు కష్టపడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదర్శపాలనను స్ఫూర్తిగా తీసుకుని కౌన్సిల్ సభ్యులు ప్రజాసేవలో పాటుపడాలని పిలుపునిచ్చారు.వైసీపీ ఎన్ని నీచమైన కుట్రలు పన్నినా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిందని తెలిపారు.పట్టణ త్రాగునీటి అవసరాలు,రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు దాదాపు రూ.260 కోట్ల ఖర్చు చేస్తున్నామన్నామన్నారు. రూ. 5 కోట్లతో పార్క్ లు,పచ్చదనం పెంపుకు కృషి చేస్తున్నామని వివరించారు. పట్టణ సుందరీకరణకు కౌన్సిల్ సభ్యులు పాటుపడాలిపట్టణంలో ఇరుకు రోడ్లన్నీ నేడు కూటమి ప్రభుత్వంలో విశాలమైన బైపాస్ రోడ్లుగా మారాయని, పచ్చదనం,విద్యుద్దీకరణతో మున్సిపాలిటీ సుందరీకరణకు కౌన్సిల్ సభ్యులు కృషి చేయాలని కోరారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లేసి, గెలిపించినందుకు వారి విశ్వాన్ని మరింత పెంచేలా పాలన సాగించాలన్నారు.సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించేలా వారిని గుర్తించి,వాటిని అందేలా చూడాలన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చి,వాటి పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మెనుముల సుష్మారెడ్డి,పార్టీ నాయకులు కేశవరెడ్డి, యువ నాయకులు గౌతమ్ జూలకంటి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు (బీసీ)బృందం రమణారావు,కౌన్సిలర్లు,కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ చూడని,ఎవరికీ సాధ్యం కాని విజయం సాధించాం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,నవంబరు 4,ప్రభాతవార్త : స్వాతంత్రం వచ్చాక చిలకలూరిపేట పట్టణం ఏర్పడ్డాక ఎన్నడూ ఎవరికీ సాధ్యం కాని విజయాన్ని మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీలు సాధించాయని, ఈ విజయం ముమ్మాటికీ ప్రజా విజయమేనని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.బుధవారం ఆయన మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కూటమినాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా

30 వేల ఓట్ల మెజారిటీ సాధించిన కూటమి ఛైర్ పర్సన్ అభ్యర్థి తోట రాజరాజేశ్వరిని ప్రత్తిపాటి మనస్ఫూర్తిగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన, నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్ తోట రాజారమేశ్, చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ తోట రాజరాజేశ్వరిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రత్యర్థి పార్టీ నాయకుల ముఖం చూడటానికి కూడా ప్రజలు ఇష్టపడటం లేదు48 వార్డులకు గాను. కూటమి అభ్యర్థులు 46 స్థానాల్లో విజయం సాధించారని, ఓడిన రెండు వార్డుల్లోనూ 100 అంతకంట

మురసు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో వేగంగా

విద్యుత్తు పునరుద్ధరణ

మంత్రి గొట్టిపాటి,ఎమ్మెల్యే డా. చదలవాడ

నరసరావుపేట, నవంబర్ 4, ప్రభాతవార్త: మురసు తుఫాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో అస్తవ్యస్తమైన విద్యుత్తు వ్యవస్థను పునరుద్ధరించేందుకు విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి వేగవంతమైన చర్యలు చేపట్టారు. అన్ని పట్టణాలు, గ్రామాలకు విద్యుత్తు

సరఫరాను పునరుద్ధరించినట్లు జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ నల్లూరి మస్తాన్ రావు బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం తెల్లవారుజాము నుంచి బలమైన గాలులతో కూడిన ఎడతెరిపిలేని వర్షం కారణంగా నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో పెద్ద చెట్లు, హోర్డింగులు కూలిపోవడంతో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 33 కేవీ పరిధిలో 8 ఫీడర్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోగా, బుధవారం ఉదయానికి 7 ఫీడర్లకు సరఫరా పునరుద్ధరించామన్నారు. 11 కేవీ పరిధిలో అంతరాయం ఏర్పడిన 63 ఫీడర్లకు బుధవారం మధ్యాహ్నానికి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు.వర్షాల కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తిన 41 ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు నిర్వహించి పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. 11 కేవీ పరిధిలో 149, 33 కేవీ పరిధిలో 12, ఎల్‌టీ పరిధిలో 99 విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయని తెలిపారు. సుమారు 18 కిలోమీటర్ల మేర విద్యుత్తు తీగలు దెబ్బతిన్నాయని వివరించారు.ఎన్నికల నేపథ్యంలో గురువారం రాత్రికి అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేట్టామని, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల పునరుద్ధరణ పనులను గురువారం నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. విద్యుత్తు పునరుద్ధరణ పనుల్లో ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు. తుఫాను కారణంగా విద్యుత్తు శాఖకు సుమారు రూ.1.2 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.నరసరావుపేటలోని రామిరెడ్డిపేటలో జరుగుతున్న విద్యుత్తు పునరుద్ధరణ పనులను రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు జిల్లా యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాంభోట్లు, డీఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాను బాధితులకు విజయ్ కుమార్ కూరగాయల పంపిణీ

నరసరావుపేట టౌన్, నవంబర్ 4, ప్రభాతవార్త: మురసు తుఫాను ప్రభావంతో పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు నరసరావుపేటలో కూరగాయల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఆదేశాల మేరకు కపిలవాయి విజయకుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడ్కో హౌసింగ్ కాలనీ, ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలలో తుఫాను కారణంగా పనులు లేక పస్తులుంటున్న కుటుంబాలను గుర్తించి వారికి సహాయం అందించారు. టిక్కో హౌసింగ్ కాలనీని సందర్శించిన కపిలవాయి విజయకుమార్ సుమారు 50 కుటుంబాలకు పది రకాల కూరగాయలతో

కూడిన కవర్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడంలో లభించే ఆనందం మరే దానిలోనూ ఉండదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఆదేశాల మేరకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అవసరమైతే గురువారం ఉదయం 10 గంటలకు మరోసారి కూరగాయలు తీసుకొని కాలనీలకు వస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు మస్తాన్‌వలి, ఉమా, బుజ్జి, సత్యానంద్ బాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వినగడప కట్టలేరు వాగుపై ఎన్నాళ్ళో కష్టాలు

20 ఏళ్లుగా ప్రజలకు తప్పని తిప్పలు

ఎ కొండూరు, అక్టోబరు 4, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు ఏరు పై సుమారు 20 ఏళ్ల క్రితం కూలిన బ్రిడ్జి స్థానంలో నేటి వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు కట్టలేరు వాగుకు వరద ఉధృతి ప్రవాహం వల్ల ప్రతి ఏడాది వర్షాకాలం తుపాను భారీ వర్షాలు వల్ల తాత్కాలిక రిపేర్లు

నిర్వహిస్తూ గత వైసిపి పాలకులు ప్రస్తుత ఎన్ డి ఏ కూటమి పాలకులు తాత్కాలిక రిపేర్లు కొరకు లక్షలాది రూపాయలు గుత్తేదారులకు మంజూరు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటం తప్ప ఈ కట్టలేరు ప్రాంత ప్రజలకు ప్రయోజనం శూన్యమని ఈ ప్రాంత ప్రజలు ప్రయాణికులు ఉద్యోగులు వ్యాపారులు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఆక్షేపించారు నూజివీడు గంపలగూడెం ఆర్ అండ్ బి రాష్ట్ర రహదారి లో ఉన్న ఈ కట్టలేరు బ్రిడ్జి ప్రతి ఏడాది వరదల ఉధృతికి కొట్టుకుపోతుండటంతో ఆంధ్ర తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 100 గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం లేక మూడు కిలోమీటర్లు ప్రయాణించే ప్రయాణికులు సుమారు 30 కిలోమీటర్ల దూరం నుండి ప్రయాణించాల్సి ఉంది గత వైసిపి పాలనలో అప్పటి సీఎం దృష్టికి అప్పటి తిరువూరు ఎమ్మెల్యే తీసుకుని వెళ్లి అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు రూ 24 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సార్వత్రిక ఎన్నికల ముందు తిరువూరు బహిరంగ సభలో ప్రకటించి అప్పటి తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధికి ప్రజా సమక్షంలో హామీ ఇవ్వగా హామీ అనంతరం సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో ఎన్నికల కోడ్‌తో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం ఎక్కడి వేసిన గొంగళి ఎక్కడైనా క్షేమంగా నిలిచిపోవడంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక ప్రజల అవస్థలు బాధలు తప్పలేదు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడగా తిరువూరు ఎమ్మెల్యే విజయవాడ ఎంపిలు కట్టలేరు బ్రిడ్జి సందర్శనలు తప్ప హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్లు దాటిన నిధులు మంజూరు చేయటం కానీ టెండర్లు పిలవటం కానీ నేటి వరకు చేయకపోవడం పట్ల ఎన్డీఏ కూటమి ప్రభుత్వ తీరును ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్రంగా అక్షేపిస్తున్నారు. ఈ కట్టలేరు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు ప్రస్తుత విజయవాడ ఎంపి ఎమ్మెల్యేలు సందర్శించి త్వరలో బ్రిడ్జి టెండర్లు పిలిపించి నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పి ఏడాది దాటుతున్న ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మాణం కొరకు టెండర్ల ఊసే లేకపోవడం పట్ల ప్రజా ప్రతినిధుల చిత్తశుద్ధిని ఈ ప్రాంత ప్రజలు శంకిస్తున్నారు. గత వైసిపి పాలకులు ప్రస్తుత ఎన్డీఏ పాలకుల తీరు తమకు శాపంగా మారిందని మరి ఈ బ్రిడ్జి నిర్మాణం విషయంలో పాలకులు ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారు తమకు అంతుపట్టడం లేదని ఈ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రజలు కూడా అప్పటి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారని అలాగే ప్రస్తుత రెండేళ్ల పాలకులు కూటమిపాలకులు ఎందుకు దృష్టి సారించటం లేదో తమకు అర్థం కావడం లేదని ఇకనైనా తమ పట్ల కనికరం చూపించి ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు ప్రజలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలు వ్యాపారులు ఉద్యోగులు విద్యార్థులు రెండు చేతులు జోడించి మొరపెట్టుకుంటున్నారు. ఇకనైనా ఎన్డీఏ కూటమి పాలకులు కళ్ళు తెరిచి కట్టలేరు నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి టెండర్లు ద్వారా హై లెవెన్ నిర్మాణం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ఆదుకోవాలని సిపిఎం సిపిఐ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నీటిని బయటకు పంపేందుకు డ్రైనేజి చర్యలు చేపట్టాలి

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జి.కిషోర్‌బాబు

చేబ్రోలు(పొన్నూరు), నవంబరు 4,ప్రభాతవార్త: ఇటీవల మురసు తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో వర్షపునీరు నిలిచిపోయిందని, రైతులు నీటిని బయటకు పంపేందుకు డ్రైనేజి చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్త డాక్టర్ జి.కిషోర్‌బాబు సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని చేబ్రోలు, పాతరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ పలు పొలాల్లో ఇనుపధాతు లోపాన్ని గుర్తించారు. దీని నివారణకు

అన్నభేది 50గ్రాములు, నిమ్మ ఉప్పు ఐదు గ్రాములు, యూరియా వంద నుండి 150గ్రాములు పది లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. మినుములో వేరు కళ్ళు, ఆకుమచ్చ తెగులు సోకకుండా హెక్సా కొనాజోల్ 20మిల్లీ లీటర్లు, ప్రోఫికోనజోల్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ ఎ.మనోజ్ మాట్లాడుతూ అవకాశాన్ని బట్టి పాడైపోయిన చేలు పైకి లేపి కట్టుకోవాలన్నారు. నీరు తగ్గిన తర్వాత హెక్సాకొనాజోల్ 400మిల్లీలీటర్లు, ప్రోపికోనజోల్ 200మిల్లీ లీటర్లు ఒక ఎకరానికి పిచికారి చేయడం ద్వారా మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకురాలు రామకోటేశ్వరి, మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ల అనంతరం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ, నవంబర్ 4, ప్రభాతవార్త : వరుసగా అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో అతలాకుతలమైన కోస్తాంధ్ర ప్రజలు తుఫాన్ల అనంతరం తలెత్తే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సూచించింది. అన్ని జిల్లాల్లో కలుషిత నీరు, నివ్వ నీటి కారణంగా టైఫాయిడ్, కలరా, హెపటైటిస్-ఎ, డయేరియా, డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, కాచి చల్లార్చిన లేదా క్లోరినేట్ చేసిన నీటిని తాగాలని, ఆహార పరిశుభ్రత పాటించాలని, నివ్వ నీటిని తొలగించాలని సూచించింది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు భారీ బందోబస్తు

1,188 మంది పోలీసులతో పటిష్ట భద్రత..
138 సెన్సిటివ్, 92 హైపర్ సెన్సిటివ్ ప్రాంతాల గుర్తింపు
సమర్థ్ యాప్‌తో క్షణాల్లో పోలీసులకు సమాచారం..
డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా

బాపట్ల,నవంబర్4,ప్రభాతవార్త.ప్రతినిధి: జిల్లాలో జరగనున్న జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిందని,ఎన్నికల విధుల కోసం 1,188 మంది పోలీసులను నియమించినట్లు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు.బుధవారం ఎస్పీ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు

అధికారులతో వర్చువల్‌గా సమావేశమైన ఆయన బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 593 పోలింగ్ లొకేషన్లను గుర్తించగా, వీటిలో 138 సెన్సిటివ్, 92 హైపర్ సెన్సిటివ్ ప్రాంతాలుగా గుర్తించామన్నారు.ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల బందోబస్తులో భాగంగా ముగ్గురు డీఎస్పీలు, 18 మంది సీఐలు, 49 మంది ఎస్ఐలతో పాటు మొత్తం 1,188 మంది పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. వీరికి అదనంగా 337 మంది మహిళా పోలీసు సిబ్బంది,మాజీ సైనికులు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

సమర్థ్ యాప్‌తో తక్షణ స్పందన :
ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా వెంటనే స్పందించేందుకు సమర్థ్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే సైరన్, వైబ్రేషన్‌తో పాటు 30 సెకన్ల వీడియో, ఫొటోలు, లొకేషన్ వివరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, సమీపంలోని స్ట్రైకింగ్ ఫోర్స్‌కు చేరుతాయన్నారు.భద్రతా చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా 29 జోన్లు, 78 రూట్ మొబైల్స్, 18 స్ట్రైకింగ్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక స్ట్రైకింగ్ బృందాలను కూడా రంగంలోకి దించామన్నారు .ముందస్తు చర్యల్లో భాగంగా 2,646 మందిని బైండోవర్ చేశామన్నారు.ఓటర్లు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, డీఎస్పీలు చంద్రమౌళి, మోయిన్, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

నేడే జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలు

ఎన్నికలకు సర్వం సిద్ధం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది..

కర్లపాలెం,నవంబర్04,ప్రభాతవార్త: మండల పరిధిలోని ఒక జడ్పిటిసి 14 ఎంపీటీసీ స్థానాలకు నేడు పోలింగ్ జరగనుంది.ప్రధాన పార్టీలైన టిడిపి వైసిపి జనసేన పోటీలో ఉన్నాయి ,మండల పరిధిలో ఉన్న 20 పంచాయితీలలో పోలింగ్ జరగనున్నది .ఈ సందర్భంగా కర్లపాలెం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బాక్సుల పంపిణీ కార్యక్రమంలో ఎస్సై రవీంద్ర పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు, కర్లపాలెం మండల పరిధిలో ఉన్న గ్రామాలను మూడు భాగాలుగా విభజించామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు ,వాటిలో అత్యంత సమస్యాత్మకం,సమస్యాత్మకం,సాధారణం గా విభజించినట్లు ఆయన తెలిపారు, పోలింగ్ సమయంలో ప్రతి గ్రామంలోనూ రెండు పక్షాలు ఉంటాయని సిబ్బంది చేసే చిన్న చిన్న పొరపాట్లే పెద్ద వివాదాలకు

దారితీస్తాయి కనుక ఎటువంటి చిన్న పొరపాటు జరగకుండా ఎన్నికలు జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు, ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది కనుక సిబ్బంది పోలింగ్ పూర్తిగా ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు ,అనంతరం ఆయా పోలింగ్ బూత్ లోకి వెళ్లే వారికి ఓటర్ రసీదులను అందించి పోలింగ్ సామాగ్రిని వారికి అప్పగించారు ,ఈ సందర్భంగా పోలింగ్ అధికారి గణనాథ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తిన వెంటనే రూట్ ఆఫీసర్లకు ,ఫ్లయింగ్ స్క్వాడ్కు సమాచారం అందించాలన్నారు ,ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఒక పోలీసులు అలాగే ఆయుధాలు ధరించిన పోలీస్ సిబ్బంది ఉంటారని ఆయన స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్ర కుమార్ ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ పోరుకు సర్వం సిద్ధం!

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

బాపట్ల,నవంబర్4,ప్రభాతవార్త.ప్రతినిధి: జిల్లాలో 5వ తేదీన జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా అత్యంత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది పరిపూర్ణంగా సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఎన్నికల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన వీక్షణ

సమావేశంనిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.విధుల పట్ల నిరక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.ఎన్నికల విధులకు కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులు గైర్హాజరైతే ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. విధులకు రాని వారిపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లాలోని 1,080 పోలింగ్ కేంద్రాలకు 119 నిర్దేశిత రూట్ల ద్వారా ఎన్నికల సామగ్రిని భద్రంగా తరలించాలన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది ప్రతి ఒక్కరూ సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.వర్షాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాటువిద్యుత్ సరఫరాకు ఎక్కడా అంతరాయం కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పునరుద్ధరణ చర్యలు వేగవంతం చేయాలన్నారు.ఇప్పటికే విద్యుత్ శాఖకు చెందిన 600 మంది సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని, మరింత చురుగ్గా పనిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించాలన్నారు. మార్టూరు, పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాం మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు గురువారం ఉదయాన్నే విద్యుత్ సౌకర్యం అందిస్తామని,ఒకవేళ ఆలస్యమైతే తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు.ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో మాట్లాడి,పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా గట్లు తొలగించి నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు.రాత్రి 10 గంటలకల్లా స్ట్రాంగ్ రూములకు సీల్ వేయాలన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ సెంటర్లలో అవసరమైన అన్ని ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్లు, ఆర్ అండ్ బిడిఈలు దగ్గరుండి పూర్తి చేయాలన్నారు.గురువారం ఉదయం 8 గంటలకల్లా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రారంభమయ్యేలా రిటర్నింగ్ అధికారులు పక్కా చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్నం నుంచే ఆయా పరిధిలోని స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లను పరిశీలించి, 5వ తేదీ రాత్రి 10 గంటలలోగా అన్ని మండలాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములకు పక్కాగా సీల్ వేయాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూములకు తరలించే క్రమంలో ఎంపీడీవోలు స్వయంగా వెంట ఉండి పర్యవేక్షించాలన్నారు.సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ నిఘా

మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 544 కేంద్రాలకు సీసీ కెమెరాలు, మిగిలిన 544 కేంద్రాలకు వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్,స్టాటిక్ సర్వలెన్స్,వీడియోగ్రఫీ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించాలన్నారు. జిల్లెలమూడి, చెరుకుపల్లి పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను సమీపంలోకి మార్చామన్నారు. మండల విద్యాశాఖ అధికారులు తక్షణమే ఎంపీడీఓ కార్యాలయాల్లో రిపోర్టు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి,జిల్లా పంచాయతీ అధికారి నగేష్ కుమార్,సీపీఓ షాలేమురాజు, డ్వామా పీడీ విజయలక్ష్మిలతో పాటు వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పడిపోయిన వరిపైరును పనలుగా కట్టి లేపాలి

వ్యవసాయ సహాయ సంచాలకురాలు రామకోటేశ్వరి

పొన్నూరు, నవంబరు 4,ప్రభాతవార్త: పడిపోయిన వరిపైరును ఐదు,ఆరు పనలుగా కలిపి కట్టి లేపాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి సూచించారు. మురసు తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను బుధవారం అధికారులు బృందం సందర్శించి పరిశీలించారు. మండల పరిధిలోని మునిపల్లె, ఆరెమండ, చింతలపూడి తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ ముఖ్యంగా వరిపంట పూత దశ నుండి పాలు పోసుకునే దశలో ఉందన్నారు. రైతులు వీలైనంత త్వరగా వర్షపు నీటిని బయటకు పంపుకునే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ వరి పొలాల్లో నీరు తగ్గిన తర్వాత హక్సాకోనాజోల్ 400మిల్లీలీటర్ల, ప్రోపికోనాజల్ 200ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారి చేయాలన్నారు. దీని ద్వారా మాగుడు తెగులు వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. గింజ గట్టిపడే దశలో ఉండి, అధిక వర్షాలకు గురైతే పొలాల్లో అధికంగా ఉన్న నీటిని అంతర్గత కాలువల ద్వారా బయటకు పంపాలన్నారు. రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు మందులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, ఎంపీఈవో సింహాద్రి సురేష్‌బాబు, ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని వ్యక్తి జగన్మోహనరెడ్డి

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, నవంబరు 4,ప్రభాతవార్త: ప్రజాస్వామ్యంపై నమ్మకంలేని వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన తొలివిడత మునిసిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన ఘన

విజయమే రాష్ట్రంలో ప్రజల మద్దతుకు నిదర్శనమన్నారు. జగన్మోహనరెడ్డి ఇన్నాళ్ళుగా ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్ళుగా చేపట్టిన ప్రజా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కూటమి గెలుపుకు దోహదపడ్డాయన్నారు. గతంలో ఈవిఎంల ద్వారా ఎన్నికల్లో గెలిచారని ఆరోపణలు చేసిన జగన్ ఇప్పుడు బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరిగినప్పటికీ కూటమి విజయాన్ని జీర్ణించుకోలేక ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల విధానం ఏదైనా అంతిమంగా ప్రజల తీర్పు కూటమికేనన్నారు.రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, అయితే ఓటు వేయడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిగా ఓటు అడిగే జగన్మోహనరెడ్డి స్వయంగా పోలింగ్ కేంద్రానికి వెళ్ళి ఓటు వేయకుండా వెనుదిరగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఓటు వేయాలనే బాధ్యతను విస్మరించిన నాయకుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్ళ వైకాపా పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎన్నికలను ఏకపక్షంగా మార్చేందుకు ప్రయత్నించారన్నారు. కడప జిల్లాలో పెద్ద సంఖ్యలో స్థానాలు ఏకగ్రీవం కావడం, మాచర్ల వంటి ప్రాంతాల్లో ప్రత్యర్థి అభ్యర్థులను బెదిరించడం, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, కిడ్నాప్‌లు, దాడులకు పాల్పడిన ఘటనలు ప్రజలకు గుర్తున్నాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎన్నికల యంత్రాంగం, పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోంటోందన్నారు. మాచర్లలో బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది కిషోర్‌లపై జరిగిన దాడులను ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, గతంలో వైకాపా పాలనలో నెలకొన్న రాజకీయ హింసాత్మక పరిస్థితులు ప్రజలు మరిచిపోలేదన్నారు. పులివెందుల వంటి ప్రాంతాల్లో సైతం గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఏకగ్రీవాలు, బెదిరింపుల ద్వారా ఎన్నికలను ప్రభావితం చేసేవారని, ప్రస్తుతం ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. నిజమైన ప్రజాస్వామ్యం అంటే ప్రతి అభ్యర్థికి పోటీ చేసే అవకాశం, ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉండ